# నేరం - శిక్ష

(ఆల్ ఇండియా రేడియో, విజయవాడ)

తెలిసీ తప్పుచేయడం నేరం.
మనం తప్పుచేసి, ఆ తప్పుకు పర్యవసానాన్ని
అసహ్యించుకోవడం మరీ పెద్దనేరం

"ఎవరబ్బాయ్ నువ్వు? ఇక్కడేం పని నీకూ?"

లేబర్ రూమ్ తలుపు దగ్గర తచ్చాడుతున్న తొమ్మిదేళ్ళ రాహుల్ ఇటుతిరిగాడు. ఆ పిల్లాడిని కసిరిన పంకజం, నాతోటి నర్సు పదిరోజుల లీవ్ తర్వాత రాత్రే డ్యూటీ కొచ్చింది. వాడిని చూసి దడుసుకున్నట్టు ముఖం పెట్టి నా వైపు తిరిగి గుసగుసగా అంది.

"అబ్బ! ఏమి సుందరాకారుడే బాబూ! రాత్రికి కలలోకి రాగలడు"

నేను కలవరపాటుగా ఆ అబ్బాయివైపు చూసాను. అసలే ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధపడుతున్న పసిబిడ్డవాడు ఆపసికళ్ళు అవమానభారంతో వాలిపోయాయి.

"ఏమ్మా ఇక్కడున్నావూ?" లాలనగా అడగాను. వాడుజవాబు చెప్పలేదు. వాడి విశాల మయిన కళ్ళ నిండా నీరు ఉబికి, ఉరికి, వాడి బుగ్గల మీదుగా ప్రవహించబోతోంది. నేను దగ్గరగా వెళ్ళాను. అనునయంగా చూసాను.

వాడు రెండడుగులు నావైపుగా వేసి మరలా వెనక్కు తిరిగి కాన్పులగది తలుపుల వైపు క్షణం ఆశగా చూసాడు.

'నువ్వెళ్ళమ్మా నీకు తమ్ముడో, చెల్లిలో పుట్టాక నేను నిన్ను పిలుస్తాగా" నేను వాడి చెయ్యి పట్టుకున్నాను.

వాడి తల్లి మాధవి లేబర్ రూమ్‌లో పురిటి నొప్పులు పడ్తోంది.

ఉహు నేను రాను. ఇక్కడే వుండాను" కదల్లేదు రాహుల్

"ఎందుకు?"

"నాతమ్ముడు కూడా నాలాపుడ్తే అమ్మ నన్నుతిడ్తున్నట్టే వాడినీ తిడ్తుందిగా పాపం"

నాకు జాలేసింది రాహుల్ తల చాలా పెద్దది. హైడ్రోకెఫాలస్, పైగా గేణశూల తాలూకు ఆపరేషన్ మచ్చ.

"నిన్ను తిడ్తుందా మీ అమ్మ? తల్లి అసలు బిడ్డను తిట్టదు. అబద్దం చెప్తున్నావు"

"నిజం ఆంటీ 'నాకడుపున చెడబుట్టావురా' అంటుంది."

"ఇంకెవరంటారలా మీ నాన్న కూడా అంటారా?"

రాహుల్ ఆలోచిస్తున్నట్టుగా నిముషం ఆగాడు

"ఆహా నాన్న ఎప్పుడూ అనరు ఎప్పుడో విసుగు వస్తే అంటాడు"

"విసుగా? ఎందుకొస్తుందంట మీ నాన్నకంత విసుగు?"

"ఇరవైనాలుగ్గంటలూ నన్నిలా చూస్తే పాపం బాధేసి విసుగురాదూ!"

ఆపిల్లాడి విజ్ఞానానికి విస్తుపోయాను.

తొమ్మిదేళ్ళపిల్లాడు ఎంత లోతుగా ఆలోచిస్తున్నాడు! ఎంత డీప్‌గా అర్థం చేసుకుంటున్నాడు! అలావాడిని ఆలోచింపజేసే వాడి పరిస్థితులు ఎంత దైన్యమైనవి!! ఒంటి మీద స్పృహలేనట్టుగా ఆడుతూ, పాడుతూ గడపాల్సిన వయసులో ఎంత అవాంఛనీయమైన విచక్షణాజ్ఞానం!

లేబర్ రూమ్ తలుపు తెరుచుకుంది. ఆయా చేతిలో పొత్తిళ్ళల్లో పసిబిడ్డ. ఆబిడ్డ రాహుల్ తమ్ముడా? లేక మరెవరి బిడ్డో! అని అనుకోవడానికి మాదేం పెద్దహాస్పిటల్‌కాదు. ఇద్దరు డాక్టర్ల చేత నడపబడుతున్న చిన్న నర్సింగ్‌హోమ్ అది.

రాహుల్ ఆతృతగా అటుచూసాడు వాడికంటె ఎత్తులో వున్న ఆయాచేతిలో వున్న బిడ్డ రాహుల్‌కి కన్పించలేదు. మునికాళ్ళమీద నిక్కిచూస్తున్నాడు. నేను ఆయాను ఆపాను.

"తమ్ముణ్ణి చూస్తావా?"

చూస్తానన్నట్టు ఆశగా, సంతోషంగా తలాడించాడు.

ఆయాకొద్దిగా చేతులు దింపి బాబును చూపించింది.

నేను రాహుల్ కళ్ళల్లోకి చూసాను. వాడికి తన మనస్సు స్పందించే భాషను వ్యక్తం చేయటం చేతకాదు, కానీ ఆపసివాడి మనోస్పందన ఆవిశాలమైన కళ్ళల్లో ప్రతిఫలిస్తోంది.

క్షణకాలం రచయితలా అప్పుడే విచ్చుకున్న ఆ చిన్న శరీరాన్ని చలించేచూపులతో చూసాడు. మరుక్షణంలో చిత్రకారుడిలా వాడి చూపు ఆబుల్లి బాబుతమల పాకుల్లాటి,

గులాబి రేకుల్లాటి పెదాలమీద నిల్చిపోయింది. రాహుల్ కళ్ళల్లో వెన్నెల రేఖ జారిపడింది. వాడి నునుపైన మొత్తటి చూపుడువేలు ప్రేమగా తమ్ముడి పెదాల్ని నిమిరింది. వాడి కళ్ళు తృప్తిగా, గర్వంగా నావైపు చూసాయి.

"బుజ్జాయివి అమ్మ పెదవుల్లాగున్నాయి కదూ ఆంటీ"

వాడు నావైపు తృప్తిగా చూస్తుంటే నాకూ ఒక వైపు ఆనందంగా వున్నా మరో వైపు వాడిపై అనంతమైన జాలికలిగింది. పుట్టుకతో వాడిపైపెదవి ఎడంవైపు గ్రహణశూల, అంగిలిదాకా సాగి ఆపరేషన్ అయినా పెదాలు, ముక్కు ఇంకా వికారంగానే వుంటాయి. ఆ పెదాల్ని దాటి చిగుళ్ళు ముందుకొచ్చి దవడెముకపొడుచుకొచ్చి ముఖం అసహ్యంగానే వుంటుంది.

మనసును ఆక్రమించుంకుంటున్న వాడిమీద జాలితెరల్ని, వాడిఅబ్‌నార్మల్‌తల మీద ఆక్షేపణా భావాన్నీ, మనుషుల స్వభావాల మీద విసుగునీ, విదిలించుకుని వాడివైపు చూసాను. ఎలాంటి ఈర్ష్యాభావం మనసులో వున్నట్టు లేదు. స్వచ్ఛంగా నవ్వుతున్నాడు. ఆనవ్వు అందవికారంగా వుంటే ఏం? మనకు లేని సౌందర్యం ఇంకొకరిలో చూసి ఈర్ష్య పడని అలాటి నవ్వు ఎంత మంది నవ్వగలరు? వాడు పసివాడే కావొచ్చు పెద్దవాళ్ళల్లో వుండే ఈర్ష్యలు పసిపిల్లల్లోనూ వుంటాయి మరి.

"నన్ను వెళ్ళమంటారామ్మా" ఆయాకదిలింది.

"అదేమిటి వెంకమ్మా! ఇటెళ్తున్నా వెందుకూ?" నర్సస్ రూమ్‌వైపు వెళ్తున్న ఆయాను అడిగాను.

"డాక్టరమ్మ బిడ్డను తల్లికి చూపవద్దన్నారు. నర్సర్ రూమ్‌లో ఉయ్యాల వేసివుంచమన్నారు.

"ఎందుకు?"

"ఈ బిడ్డకు కాళ్ళు లేవటమ్మా"

నేను గతుక్కుమన్నాను. వెంటనే తల దించి రాహుల్‌వైపు చూసాను. వాడు ఆయా మాటలు విన్నట్టు లేదు.

"రాహుల్! రూమ్‌లో కెళ్ళమ్మా" అనేసి ఆయాతో నడిచాను.

రాహుల్ తనదగ్గరకొచ్చి, ఓరోజు సందేహిస్తూ అడిగాడు.

'ఆంటీ! మామయ్య నన్ను 'ఆంజనేయులూ!' అనిపులుస్తారెందుకు?' దానికి కారణం తనకి తెసిలీ ధృవీకరించుకోవాలన్న జిజ్ఞాస వాడికళ్ళల్లో చిక్కగా కన్పించింది నాకు.

"ఊరకేలేమ్మా! ఆంజనేయులు అంటే దేవుడు కదా అందుకనీ"అని వాడినిమాయపుచ్చింది తనారోజు

"ఆంటీ! నాకూ తమ్ముడున్నాడు"

గత స్మృతుల నుండి తేరుకున్నాను

'తమ్ముడంటే నీకంత ఇష్టమా?"

"తమ్ముడయితే చిన్నాడుకదా! నేను ఎన్ని ముద్దులయినా పెట్టుకోవచ్చు" సంబరంగా చెప్పాడు రాహుల్

"తమ్ముడికే అన్ని ముద్దులయితే అమ్మకీ నాన్నకు ఎన్ని ముద్దులు పెడ్తావు?" అలా అనేసిన తర్వాత 'అలా అనకుండా వుండాల్సింది'. అని బాధపడ్డాను. వాడి ఆల్చిప్పలాంటి కళ్లల్లో మరలా తడి.

"ఉహు నన్నెవరూ ముద్దు పెట్టుకోరు...... మాఅమ్మకూడా"

ఎంతకిరాతకురాలా తల్లి! అని మరొక్కసారి అనుకోకుండా వుండలేకపోయాను. నేనింకా తల్లిని కాలేదు. కనీసం పెళ్ళికూడాకాలేదు నాకు అయినా ఎలాటి బిడ్డమీద అయినా తల్లి గుండెల్లో ప్రేమ వుంటుందనే అన్పిస్తుంది నాకు.

నా మనసు అర్ద్రమయింది -

'ఎవరో ఒకర్ని ముద్దుపెట్టుకోవాలి. ఎవరో ఒకరి చేత ముద్దు పెట్టించుకోబడాలి' అనేది ఆవయసులో ఎంత చిన్న కోరిక! వాడి నిశ్శబ్ద దోరణి వెనక ఎంత దీనత్వం. ఇప్పుడే కళ్ళు తెరిచిన పసిబిడ్డ అయితే తన అన్న ముద్దును కాదనడని వాడి భరోసా అదీవాడి సంతోషం.

"నాతమ్ముడు బావున్నాడు"

"ఎందుకు బావుండడూ?"

"నాలా వుంటాడేమోనని భయపడ్డాను"

నేను చలించాను. "ఏం?నీలావుంటే ఏం?"

ఈ పసిబిడ్డలో ఈ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ తగ్గించాలని అన్నాను.

"ఉహు నాలా వుండకూడదులే అందరూ అసహ్యించుకుంటారు. ముద్దుపెట్టుకోరు. ఉహు అది బాగుండదు" వ్యక్తం చెసే గొప్పభాషవాడికి రాకపోవచ్చు కానీ వాడుఎంత నరకం అనుభవిస్తున్నాడో ఆ ఒక్కచిన్న వాక్యంలో నాకర్థమయింది.

"అసహ్యించుకునేది ఎందుకురాహుల్? వాళ్ళందరూ అందంగా వున్నారా?"

"నాకంటే ఎవరైనా అందంగా వుంటారు!" తగ్గుస్వరంలోనే అన్నా చాలా దృఢంగా అన్నాడు.

"పోనీ పోనీ రాహుల్! అందంగా వుండడం వుండకపోవడం మనతప్పేమిటీ మనం కావాలని అలా పుడ్తామా చెప్పు.?"

వాడు కళ్లార్పకుండా నావైపు చూసాడు

నేను వాడిని వదిలి మారూమ్‌లోకి నడిచాను ఉయ్యాల్లో రాహుల్ తమ్ముడు అప్పుడే విచ్చుకున్న ఆలేత బిడ్డకు కాళ్ళు రెండూ మోకాలు పైనే మొండేలుగా వేలాడుతున్నాయి.

ఎంతదురదృష్టం! అందరిలా నిటారుగా నిలబడి స్వయంగా నడవలేని ఆదౌర్భాగ్యం ఎంత దయనీయం!

పనులన్నీ పూర్తి చేసుకుని తిరిగ్గా నర్సస్‌రూమ్‌లో కెళ్ళాను. 'ఆశ్చర్యం? ఎలా తెలుసుకున్నాడో! ఎలా వచ్చాడో తమ్ముడి ఉయ్యాల దగ్గర రాహుల్!?'

రాహుల్ తర్వాత ఇద్దరు చనిపోయి పుట్టాక ఈనాడు తను ఆడుకోవడానికి వాడికి వాడి అమ్మ బహుమతిగా ఇచ్చిన సజీవమైన తమ్ముణ్ణి ముద్దులతో ముంచేస్తున్నాడు. నేను అలాగే వాకిట్లో నిల్చుని వాళ్ళను చూస్తున్నాను.

ముద్దులు పెట్టుకోవడం పూర్తయ్యాక గుప్పెళ్ళు తెరిచి వేళ్ళు చూసాడు. ఇంకా వంగి ఆ సుతిమెత్తని వేళ్ళను సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత అటు ఇటు చూసాడు. మెల్లిగా పొత్తిళ్ళు కదిలించి కాళ్ళమీద పరిచిన గుడ్డలాగేసి కెవ్వుమన్నాడు.

అప్పుడు నాకాళ్ళకు చైతన్యం వచ్చింది.

"ఆంటీ! ఆంటీ! ఇదేవిటీ?" నాకళ్ళను చుట్టేసి వెక్కి వెక్కి ఏడ్చాడు రాహుల్ వాడిని ఏడ్వనిచ్చి తర్వాత అన్నాను.

ప్రభువు ఎలా పుట్టిస్తే అలా పుడ్తాము మనం మనం ఏం చేయగలం చెప్పు?".

"మా అమ్మ చాలా బావుంటుంది. మానాన్నకూడా చూశ్చేదా నువ్వు మానాన్నను?" వెక్కిళ్ళ మధ్య అన్నాడు.

చూసానన్నట్టు తలూపాను.

"పాపం అమ్మ! అందంగా వుటుంది మేమెందుకిలా పుడ్తున్నాము?"

నేను నివ్వెర పోయాను.

తల్లి చేత నిరాదరించబడుతున్న ఆ బిడ్డ తల్లి కోరికను అర్థంచేసుకుని, ఎంత లాదయ చూపిస్తున్నాడు! ఆమెగుర్తించలేదు గానీ, ఇలాటి బిడ్డను కన్న ఆమె ఎంతఅదృష్ట వంతురాలు!!

"పాపం అమ్మ!"మరొక్కసారి జాలిపడ్డాడు రాహుల్

వాడిని వాడి అమ్మరూములో వదిలి వచ్చేసాను.

---

ఆసాయంత్రం మూడో నెంబరు రూమ్‌లోనుండి కేకలు విన్పిస్తుంటే అటు వెళ్లాను. రాహుల్ తల్లి మాధవికి తన రెండో కొడుకు అవకరంగురించి తెలిసినట్టుంది పిచ్చి పట్టిన దానిలో ఏడుస్తోంది. "ఇద్దరి బిడ్డల్నీ అనాధాశ్రమానికి ఇచ్చేయండి" అని అరుస్తోంది నేను లోపలికెళ్లి ఆమెను ఓదార్చాలనుకున్నాను. ఇంతలో అటు వెళ్తున్న ఓ. పేషంటు నన్ను ఆపింది.

"ఈరకత పరీక్షల కెంతవుద్దీ' నాచేతిలో ఒక కాగితం వుంచి అడిగింది.

నేను చెప్పాను.

"అందరూ ఈడాక్టరమ్మ చెయ్యి మంచిదంటే ఏదో ఈపుట్టేబిడ్డన్నా దక్కద్ద వొచ్చా గానీ- మందులురాసీకుండా ఈ పరీక్షలెందుకో" గొణుక్కుంటూ వెళ్ళబోతున్న ఆమెను ఆపాను.

"ఎన్నో కాన్పిది?"

"నాలుగో కాన్పు"

"ముగ్గురు పిల్లలున్నారు నీకు ఇంకా...?"

ఏడీ పిల్లలు తల్లీ! నాకరమం అందరూ సచ్చిపుట్టారు."

చాలా మంది పేషెంట్లు ఇలాగే డాక్టర్లు రక్త పరీక్షలకు వ్రాస్తే డబ్బు కొరకు వ్రాసారనుకుంటారు. నిజానికి తల్లి రక్తం Rh-vc గ్రూప్ అయితే తండ్రి Rh+vc గ్రూప్ అయితే తండ్రి రక్తం బిడ్డకొస్తే మొందటి బిడ్డ తప్పించుకుంటాడు గానీ మిగతా బిడ్డలు చనిపోవడానికి ఎన్నో అవకాశాలున్నాయి. ప్రతి తల్లీ ఈ టెస్ట్ చెయించుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ముందుగా తెల్సుకుంటే మొదటి కాన్పు అయిన నలభై ఎనిమిది గంటల్లో తల్లికి ఏంటి డి ఇంజక్షన్ ఇస్తే మిగతా పిల్లలకు ఏమీ ఇబ్బంది వుండదు. అదేవిషయం ఆమెకు విశదపరిచాక ఆమెలాబ్ వైపు కెళ్లింది.

ఎదురుగా డాక్టరు దంపతులు రౌండ్స్ కొస్తున్నారు. వాళ్లతో కలిసిలోపలికి నడిచాను నేను.

"పొరపాటు మీదగ్గరుంచుకుని పిల్లల్నిలా అసహ్యించుకోవడం ఏమీ బాగలేదమ్మా" నిదానంగా అన్నాను డాక్టర్ చక్రవర్తి ఆమెను పూర్తిగా ఏడవనిచ్చిన తర్వాత

విస్తుబోయినట్లు చూసింది రాహుల్ అమ్మ

"మీదిమేనరికం కదూ! మిస్టర్ వేణూ!"

అవునన్నట్లు తలూపాడు రాహుల్ తండ్రి డాక్టర్‌గారు మాధవి వైపు తిరిగారు. "మీ అమ్మను మీ అమ్మమ్మ తమ్ముడికిచ్చారు. మరలా నిన్ను మీ అమ్మతమ్ముడికే ఇచ్చారు. అంటే ఈయన మరలా మీ మేనమామ" అవునా?"

అవునన్నట్లు తలూపిందామె

"ఇంకెలాపుడ్తారమ్మా మంచిపిల్లలు!" ఈసారి కాస్త విసురుగానే అన్నారాయన అర్ధం కానట్టు చూసిందామె. ఆమె అందమైన కళ్ళు ఏడ్చిఏడ్చి ఉబ్బిపోయున్నాయి.

"వేర్వేరు కులాల్లో పెళ్ళి చేసుకుంటే చాలా తెలివిగల పిల్లలు, ఆరోగ్యమైనపిల్లలు పుడ్తారు. ఒక్కతరంలోనే రక్తసంబంధీకుల్ని చేసుకుంటె తెలివిహీనులుగా అనారోగ్యులుగా పుడ్తున్నారు. మీరు మూడుతరాల నుండి అటు, ఇటు ఆడపిల్లల్ని మారుస్తుంటే ఇలాగే పుడ్తారమ్మా పిల్లలు" కఠినంగా అన్నారాయన.

రాహుల్ తండ్రి అర్ధమయినట్టు చూసాడు.

"మరెలా డాక్టర్"? అన్నాడు దిగులుగా

"మీరేమీ అనుకోకపోతే ఇలాటి పిల్లల్ని కని మీరు బాధపడి వాళ్ళను బాధపెట్టే కంటే మీరింతటితో ఆపరేషన్ చేయించుకోవడం మంచిది!! మధ్యలో రెండు అబార్షన్స్ కూడా అయ్యాయి మీకు"

తల వంచుకున్నాడు వేణు

ఇకపుట్టే వాళ్ళంతా ఇలాగే పుడ్తారా?" భయంగా అడిగింది మాధవి.

"చెప్పలేం అబార్షన్స్ అవ్వొచ్చు ఇలానే పుట్టొచ్చు, పుట్టకపోవచ్చు, ఎలా పుట్టినా

వాళ్ళను మనస్ఫూర్తిగా మీరు స్వీకరించగలిగితే, వాళ్ళను మీరు ఏవగించుకుని మెంటల్ పేషెంట్లుగా మార్చరని మీమనసుగ్యారంటీ ఇస్తే ఇంకో ఛాన్స్ తీసుకోండి."

మాధవి వెఱ్ఱిదానిలా చూసింది

డాక్టర్‌కోపం ఇంకా తగ్గలేదు

"అందమైన పిల్లల్ని చెట్లు నుండి కోసుకోలేం. మనం కన్న పిల్లల్ని ఎలా వున్నా స్వీకరించాలి. ఒకె. మీరు నిర్ణయించుకోండి. ఫెమిలీ ప్లానింగ్ ఆపరేషన్ చెయమంటే చేస్తాను. లేదా మరోఛాన్స్ తీసుకోండి"

మాధవి ఏదోమాట్లాడబోయింది.

'వద్దు డాక్టర్ మాకిద్దరు చాలు" అన్నాడు వేణు

"మీరేమంటారు?" మాధవి వైపు తిరుగుతూ ఆగింది డాక్టర్ సంధ్య

"వద్దు ఇక పిల్లలు వద్దు వాళ్ళు చాలుమాకు విరక్తితోనే అయినా ధృడంగా అంటున్న మాధవి వైపు చల్లగా చూసారు డాక్టర్ దంపతులు.

F.22162